



# చెంపదెబ్బ

వ్యాస్ శ్రీనివాస్

అది ఒక పల్లెటూరు.

తెల్లవారి చాలాసేపయింది. పక్షులు. కొన్ని మాత్రం కలకలారవాలు చేస్తూ వున్నాయ్. తక్కినవి సంచారానికి వెళ్ళాయి - పొట నింపుకోవటం కోసం. శీతకాలం చలిలో, మంచులో ఆలస్యంగా లేచిన సూర్యుడు వడివడిగా పైపైకి వస్తున్నాడు.

ఆ వూళ్ళో ఉత్తరం దిక్కున, చెరు

ప్రమాదీచ 1973 ఉగాది కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

వుకు అవతల వుంది. ఒక చిన్న పెంకుటిల్లు తక్కున యిళ్ళకి కొంచెందూరంలో. వీధి వరండాని ఆనుకునివున్న ఓ మధ్య గది, దానికి పక్కగా ఓ సుమారయిన గది— అందులోనే ముసలాయన పడుకుని వుండేది. యింక, మధ్య గదిలోంచి అవతల చిన్న వంటింటిలోకి దారి వుంది. వంటింటి మెట్లు దిగగానే, పెరడూ, బావి కనిపిస్తాయి.

వీధి వరండాలో గోడకు చారగిలబడి బియ్యం ఏరుతూంది ఆవిడ. కొంచెం నల్లబడ్డ ముఖం, కొదిగా నెరుస్తున్న జుత్తు యాభయ్యవపడిలో పడినట్లుగా తోస్తుంది. ఆ పనిలో నిమగ్నురాలయిన ఆవిడ, ఒక్కసారి వులిక్కిపడింది— తన పక్కనే ఏదో శబ్దం కావటంతో, బుర్రయెత్తి చూసింది. శాంతి, ఆమె మనుమరాలు భయంభయంగా తన వయిపు చూస్తూ వుంది. కిందన నాలుగయిదు ముక్కలయిన—పలక.

"నే వేసిన దేవుడిబొమ్మ నీకు చూపిద్దామని తెస్తూ వుంటే పలక కిందపడిపోయింది మామ్మా." అయిదు సంవత్సరాల శాంతి కళ్ళు చిన్నవి చేసి అంది అమాయకంగా చూస్తూ.

ఆవిడ కోపంగానే చెప్పింది. "నువ్విలా మాటి మాటికీ పలక బద్దలు కొట్టుకుంటూ వుంటే మీ నాన్న మరి కొనడు.... తెలిసిందా...."

"యింకెప్పుడూ బదలు కొట్టుకోను మామ్మా" కిందపడి వున్న పలక ముక్కలను యేరటం మొదలెట్టింది శాంతి.

తన మనవరాల్ని తనివితీరా చూసుకుని అందమయిన కళ్ళు, చిన్ని నోరు, అంతా వాళ్ళ నాన్న పోలికే అనుకుంది ఆవిడ. మళ్ళీ తన దృష్టి మార్చుకుని బియ్యం బాగు చెయ్యటంలో నిలిపింది. మరికొన్ని నిముషాలు, చేటలో వేళ్లు కదలాడుతున్న శబ్దం తప్పించి— అంతా నిశ్శబ్దంగా వుంది.

"మామ్మా" మామూలుగా పిలిచింది శాంతి. ఇందాకటి భయం పూర్తిగా తొలగింది.

"ఆఁ ఏం?" తలఏత్తకుండానే బదులు పలికింది వాళ్ళ మామ్మ. లాగు పయికి లాక్కుని, మామ్మ పక్కన కైరాయించింది శాంతి. "అయితే దేవుడున్నాడా మామ్మా?—" అడిగింది.

"ఆఁ, వున్నాడు" తాపీగా అంది వాళ్ళ మామ్మ— తన పని పూర్తి చేసుకుంటూనే. బియ్యంలోకి చూస్తూ చేతులు కదిలిస్తున్న, వొంగివున్న మామ్మ ముఖంలోకి సూటిగా చూసింది, శాంతి. తన అనుమానం యింకా తిరలేదు.

"అయితే మనకి కావలిసినవన్నీ యిస్తాడేంటి మామ్మా?" అడిగింది. ఈ సారి, మనవరాల్ని ఒకసారి చూసి జవాబిచ్చింది మామ్మ "అన్నీ యిస్తాడు మనం దండం పెట్టుకుంటూ వుంటే."

"అయితే రోజూ పెట్టుకోవాలా?"

"ఆఁ నువ్వు రోజూ దండం పెడితేనే నీకన్నీ యిస్తాడు.... లేకపోతే యివ్వడు" అంటూ లేచింది మామ్మ. చేట అందుకుని మధ్యగదివయిపు రెండడుగులు వేసింది.

శాంతి, నిలబడింది. వున్నచోటునే జారిపోతున్న లాగుని సరిచేసుకుంది. వెళ్లిపోతున్న వాళ్ళ మామ్మ వయిపు చూసింది.


## మయూర్ సౌండ్—బ్రహ్మాండమైన పాప్యులారిటీ పోటీ

ఎంట్రీ ఫీజు లేదు— మీరు బహుమతి గెలుపొందగలరు.

| | | | |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |

మొదటి బహుమతి : ఒక స్టాండర్డు టెలివిజన్ లేక ఆల్విన్ రిఫ్రిజిరేటర్. రెండవ బహుమతి : ఒక టేపు రికార్డరు లేక ఆటోమాటిక్ కెమెరా. మూడవ బహుమతి: (100) "యాషికా" డీలక్సు పోర్టబుల్ 3 బ్యాండ్ ఆల్‌వరల్డ్ ట్రాన్సిస్టరు ధర : రు. 270/—. నాల్గవ బహుమతి : (10) "యాషికా" జూనియర్ ఆల్ వరల్డ్ 3 బ్యాండ్ ట్రాన్సిస్టరు ధర : రు. 150/—.

ఈ బ్రహ్మాండమైన పాప్యులారిటీ పోటీ ప్రపంచ ప్రసిద్ధి చెందిన మా 3 బ్యాండ్ ఆల్‌వరల్డ్ 'యాషికా' జపాన్ మోడలు ట్రాన్సిస్టరు ప్రతి పట్టణం గ్రామంలో ప్రచారానికి ఉద్దేసింప బడినది.

### మీరు చేయవలసినది

7 (ఏడు) నుంచి 22 (ఇరువది రెండు) వరకు గల అంకెలను నిలువుగా, అడ్డముగా, అయిమూలగా ఎటు కూడినా మొత్తము 58 (యాభై ఎనిమిది) వచ్చునట్లు ఒక అంకెను ఒకేసారి ఉపయోగించి (పై ఖాళీ గడులను) పూరించవలయును.

ఎంట్రెన్సు ఫీజు : ఎంట్రీ ఫీజు లేదు. ఇది ఒక పాప్యులారిటీ పోటీ మాత్రమే.

ఆఖరి పోస్టింగ్ తేదీ : 15-4-73. ఫలితం తేదీ : 20-4-73

సహాయముకొరకు 54 మొత్తముల నమూనా.

| | | | |
|---|---|---|---|
| 7 | 21 | 16 | 10 |
| 19 | 12 | 9 | 14 |
| 8 | 15 | 18 | 13 |
| 20 | 6 | 11 | 17 |

పోటీకి నిబంధనలు : జాగ్రత్తగా చదవండి. (1) సాదా కాగితము ఉపయోగించాలి. (2) సవరణలు దిద్దులు, కటింగులు కల ఎంట్రీలు అంగీకరించబడవు. (3) ప్రమోటర్ల తీర్మానము ఖాయమైనది మరియు చట్టబద్ధముగా న్యాయమైనవి. ఈ పోటీ విషయములో ఇది ఒక ముఖ్యమైన షరతు. (4) ఎంట్రీలయొక్క సక్రమము మా అఫిషియల్ సీల్డు సొల్యూషన్‌తో సరిపోల్చి ఖచ్చితముగా చూడబడును. (5) మొదటి బహుమతి : (1) మా అఫిషియల్ సొల్యూషన్‌తో సక్రమముగా వున్నట్లు కనుగొనబడినదానికి ఇవ్వబడును. (6) రెండవ బహుమతి : (1) పై అడ్డముగా వున్న మూడు వరుసలలో సమానంగా వున్నదానికి ఇవ్వబడును. (7) మూడవ బహుమతి : (ఒక వంద) మా అఫిషియల్ సొల్యూషన్‌తో ఏ వరుసతోనైనా, సంఖ్యతోనైనా సమానముగా వున్నదానికి ఇవ్వబడును. (8) నాల్గవ బహుమతి : డ్రాలో ప్రమోటరుకు సంతృప్తి నిచ్చిన పది ఎంట్రెంట్స్‌కు ఇవ్వబడును. (9) గెలుపొందినవారికి సదరు బహుమతులు పొందుటకు పోస్టేజి, ప్యాకింగ్, లైసెన్సుఫీజు, చెల్లించవలయును. (10) 3 వ మరియు 4 వ బహుమతి గెలుపొందినవారు కూడా పైన తెల్పిన ఖర్చులతో కూడా ట్రాన్సిస్టరు ఖరీదులో సగం చెల్లించాలి. మరియు మా నిబంధనలకు, షరతులకు లోబడి వుండాలి. (11) ఫలితములు పొందుటకు 50 పైసల పోస్టలు స్టాంపులు పంపాలి. (12) ఒక కుటుంబము ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. (13) ఏ విజేతకు నగదు బహుమతి ఇవ్వబడదు. (14) అడ్రసు ఇంగ్లీషు లేదా హిందీలో వ్రాయాలి, (15) కటింగ్ లేక నిబంధనల కాపీ భవిష్యత్తులో ఉపయోగార్థము ఉంచుకోండి. (16) ఫలితములు ప్రకటించిన వెంటనే లైసెన్సుఫీజు వగైరా చెల్లించేందుకు గెలుపొందిన వారికి ఉత్తరం పంపబడును.

**MAYUR AGENCIES (AV) Jaiganj, Aligarh.**

# దేవుడు

"పిలిస్తే వస్తాడేవిటి మామ్మా దేవుడు" అడిగింది.

"ఓ" అంటూ మధ్యగదిలోకి అడుగు పెట్టింది మామ్మ.

శాంతి కళ్ళు తమాషాగా మెరిశాయి.

"దేవుడోయ్ దేవుడోయ్ దేవుడూ!" అని వీధి తలుపు వయిపు చూసింది శాంతి. వడివడిగా మధ్యగది గుమ్మం దగ్గరికి నడిచింది. పెరట్లోకి వెళ్తూ మామ్మ కనిపించింది.

"ఏవిటి మామ్మా దేవుడింకా రాలేదు!"

"యింకా గట్టిగా పిలవాలే!" పెరట్లోంచే కేకవేసింది మామ్మ "యిదెక్కడ పిల్లరా—ఏవయినా తోస్తే తినేస్తుంది మనుషుల్ని" అనుకుంది.

కళ్ళు పెద్దవిచేసి, బుర్ర తమాషాగా ఆడించి, మధ్యగది కిటికీ ఎక్కింది ఉత్సాహంగా—శాంతి.

"దేవుడోయ్ దేవుడోయ్ దేవుడోయ్" చెరువు వయిపు చూస్తూ అరిచింది శాంతి. మళ్ళీ కొంతసేపాగిన తర్వాత. ఈసారి గొంతుచించుకుంది— "దేవుడోయ్ దేవుడోయ్ దేవుడోయ్.... దేవుడూ...."

మళ్ళీమళ్ళీ ఆ గొంతు మెల్లిమెల్లిగా వినిపించింది, ప్రతిధ్వనిగా. వీధి తలుపు తెరుచుకున్నట్లు కిర్రుకిర్రు మంది.

శాంతి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. చురుగ్గా కిటికీ అంచుమీంచి దిగి గుమ్మంవయిపు పరిగెత్తింది. అంతట్లోనే మధ్యగది గుమ్మం దగ్గర ఆగిపోయింది— వీధి తలుపు తెరుచుకునివుంది అక్కడ ఒక కొత్తవ్యక్తి వున్నాడు. తనెప్పుడూ అతన్ని చూడలేదు. ఆశ్చర్యంలోంచి తేరుకునే లోపలే, అతను ఓ రెండడుగులు ముందుకువేసి చిన్న మందహాసం చేశాడు.

"పిలిచావ్‌గా వచ్చేశాను" అన్నాడతను.

"అయితే నువ్వు....?" ఆశ్చర్యంగా చూసింది శాంతి.

"దేవుణ్ని."

శాంతి పెదవులు సంభ్రమంతో నిండిన చిరునవ్వుతో విచ్చుకున్నాయి. తన చిన్ని కళ్ళతో అతన్ని పరికించి చూసింది. అంతట్లోనే ఏదో గుర్తు వచ్చినట్టుగా ఓః అనుకుని, వెనక్కి తిరిగి పెరటి వైపు పరిగెత్తింది, 'మామ్మా.... మామ్మా" అని అరుస్తూ, అతను చిన్న మందహాసంతో పాపవయిపే దృష్టి సారించాడు.

వంటింటి మెట్ల దగ్గిర ఆగిపోయిన శాంతి, 'మామ్మా దేవుడొచ్చాడు రావే" అని అరిచింది. నిండు సంతోషంతో.

"నీ మొహం దేవుడు రావడంయేవిచే' అని కసురుతూ వెనక్కి తిరక్కుండానే బియ్యం కడగసాగింది. మామ్మ.

"అసలు నువ్వెప్పుడూ యింతే.... చూడు కావలిస్తే— నే పిలిచాను. వచ్చాడు" కొంచెం చిన్నబుచ్చుకుని చెప్పింది శాంతి, కటకటాల వంటింటి తలుపుమీద వాలి. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసింది. దేవుడు అక్కడ వున్నాడో లేదో అని. అతను తనవయిపే చూస్తూ వున్నాడు.

పిచ్చిపిల్ల - అనుకుంటూ బియ్యం కడగటం పూర్తిచేసిన మామ్మ, గిన్నెపట్టుకుని లేచింది. లేచిన తోడనే వీధిగుమ్మం దగ్గర ఎవరో నిలబడి వుండటం చూసింది చటుక్కున వంటింటివయిపు నడిచింది. శాంతి అడ్డం తొలగింది.

"కావలిస్తే నువ్వే చూడు" అంది శాంతి కసిగా.

గిన్నె అక్కడ దించి వడివడిగా వీధి వయిపు అడుగులు వేసింది మామ్మ—ఆ ఆగంతకుడ్ని చూస్తూ.

ఆరడుగుల విగ్రహం అతనిది. కండలు తిరిగిన శరీరం.

"ఎవరూ బాబూ మీరు? పాపచిన్నపిల్ల దానికేం తెలీదు. మీరు పట్టించుకోకండి బాబూ" సంజాయిషీ యిస్తున్నట్లుగా అంది మామ్మ అతన్ని సూటిగా చూస్తూ.

పట్టుపంచ కట్టుకున్నాడు అతను. పయిన ఉత్తరీయం కుడ చేతిలో ఓ రెండడుగుల నల్లటి గుండ్రటికర్ర.

"నేను దేవుణ్ని" గంభీరంగా కంచుకంఠంలా పలికిందతని గొంతు. మామ్మ ఆశ్చర్యపోతూ అతన్ని పరికించి చూసింది పెద్ద ముఖం అందమయిన కళ్ళు, తెల్లగా వెండిలా మెరుస్తున్న మిసాలు, గిరజాలు తిరిగిన పెదజుత్తు. పొడవయిన చేతులు, కాళ్ళకి వంకీ తిరిగిన చెప్పులు. మామ్మ అదోలా అయింది.

అంతట్లోనే తేరుకుని, "ఏవిటి బాబూ నా దగ్గర తమాషా లాడతారు! దేవుడు పిలిస్తే వస్తాడా అని పాప అడిగితే—గట్టిగా పిలిస్తే వస్తాడన్నాను- దాన్ని కొట్టిపారేయటం ఎందుకని. మీ పేరు అదేకాబోలు ....వచ్చారు. ఏదో చిన్నపిల్ల అంటున్నా కదా బాబూ...." యింకా అతన్ని పరికిస్తూనే మామ్మ అంది.

అతని పెదవులు కొద్దిగా విచ్చుకున్నాయి "నేనే దేవుణ్ని" గంభీరంగా. కొంచెం బిగ్గరగా అన్నాడతను.

"బాబూ!" ఈ సారి అతనిలో ఒక కొత్త తేజస్సు కనుక్కుంది. మామ్మ ఆమె మనసు మనసులో లేదు. అతని దేహం కొత్త కాంతితో మెరుస్తూ వుంది. మామ్మ ఒళ్ళు పులకరించింది. తెలిపోతున్నట్లుగా అనిపించసాగింది. అతను రెండడుగులుముందుకు వేశాడుహుందాగా.

"ఓ దేవుడంటే మహిమలు చూపించాలి కదూ! చూపించనా? అతని పెదవుల్లో మందహాసం తొలగలేదు.

మామ్మ పిచ్చిగా చూస్తూ వుంది, అతన్నే. స్తంభాన్ని ఆనుకుని నిలబడ్డ శాంతి వాళ్ళిద్దర్నీ వింతగా గమనిస్తూంది.

"నీకు ఐశ్వర్యాలు యివ్వనా?" మళ్ళీ అతని కంచుకంఠం పలికింది. మామ్మ మైమరచింది. మౌనంగా, పరీక్షగా అతన్నే చూస్తూ వుంది.

కర్రని చేత్తో తమాషాగా తిప్పుతూ, అతను మళ్ళీ యిలా అన్నాడు. "పోనీ, నీకు యౌవనం ప్రసాదించనా?"

చివరికా మాటలు ఆమె చెవుల్లో పడ్డాయి. ఆమె కొద్దిగా చలించింది. కొద్ది క్షణాల్లో స్తిమితపడి ఇలా అంది — అతని కళ్ళల్లోకి చూస్తూ "నా కెందుకు బాబూ యౌవనం? నాకేం కోరికలు మిగిలి వున్నాయని!...." కొంతసేపటికి "పోనీ...." అంటూ ఆగిపోయింది.

ఆమెను అర్థం చేసుకున్నట్లుగా అతను చెప్పేడు, "సందేహించకు అడుగు."

"ఏం లేదు బాబూ—ఈ పాప తాతగారు మంచం పట్టేరు. ఆయన చేతులూ, కాళ్లూ పడిపోయాయి పక్షపాతంతో....మీకు వీలయితేనే...." ఆత్రుతగా అతని కళ్ళల్లోకి చూసింది మామ్మ.

"ఓః. అర్థమయింది. ఎక్కడాయన" నెమ్మదిగా అడిగాడు ఆయన. ఆమె మనస్సుఉప్పొంగింది సంతోషపువరదతో!

కొన్ని కొన్ని సందర్భాలలో ఓ మాట చాలు ఆదుకోటానికి సంతృప్తిని యివ్వటానికి.

"తమరు యిలా దయచేయండి బాబూ" అంటూ మామ్మ మధ్య గది వయిపు వడివడిగా అడుగులు వేసింది, ఆయన హుందాగా పరిసరాల్ని పరికిస్తూ ఆమెనే అనుసరించాడు. శాంతికి యిదంతా వింతగా వుంది. యాంత్రికంగా తనూ వాళ్ళ వయిపే నడిచింది - లాగును ఒక పక్క సరిసేసుకుంటూ, "ఏవండీ ఏవండీ దేవుడొచ్చారు లేవండీ.... మిమ్మల్ని చూస్తారట...." తట్ట సాగింది. మంచం మీద పడుకుని వున్న ముసలాయిన్ని ఆవిడ. మగతగా పడుకుని వున్న ఆయనకి మాటలు వింతగా తోచాయి. ఆయన కళ్ళిప్పి ఆమె వైపు చూస్తూ "దేవుడు రావడం యేవిటే? నీకేమయినా మతిపోయిందా?... అది సరేగానీ దుప్పటి కప్పిపో ఈగలు చంపుతున్నాయి' అని విసుగు ప్రదర్శించాడు.

"ఛ. ఛ. అలా అనకండి కళ్ళుపోతాయి సాక్షాత్తూ ఆయనే మనింట్లో వున్నారు "

"గుమ్మం దగ్గరే వున్నారు ఆ బాబు. మీరే చూడండి" అంటూ అడ్డుతప్పుకుంటున్నట్టుగా లేచింది మామ్మ.

ఆ కొత్త వ్యక్తిని చూశాడు మామూలుగా ముసిలాయన కళ్ళు పెద్దవిచేస్తూ– పట్టుపంచ. భుజాల్ని కప్పుతున్న వుత్తరీయం. ఔన్నత్యంవుట్టిపడుతూన్న ముఖం. అయోమయంగా చూశాడు గుమ్మంలో నిలబడ్డ ఆగంతకుడిని "ఎవరే ఈయన? అతని పెదవులు వణికేయి.

మామ్మ ఏదో చెప్పబోయింది.

ఒక అడుగు ముందుకు వేసి.మామ్మను నెమ్మదిగా వారించి. ముసలాయనను తీక్షణంగా చూస్తూ ఆయన యిలా అన్నాడు– "యిలా రా" గది మారుమోగింది.

ముసలాయన తుళ్ళిపడ్డాడు. తడబడిన ఈ మాటలు అతనినోటినుంచివెలువడ్డాయి "నేనేంటి– లేచి రావటం యేంటి బాబూ– చేతులూ, కాళ్లూ పడిపోయినవాణ్ణి!"

"లేచి యిలా రా.... వూ!" బిగ్గరగా ఆగంతకుడు అరిచి. చేతిలో వున్న కర్రతో బలంగా పక్కనున్న బల్లమీద కొట్టాడు. ఆ ఘాతంతో గది ప్రతిధ్వనించింది. వురుములు వురిమినట్లయింది. మామ్మ వులిక్కిపడింది. యిదంతా చూస్తున్న శాంతి భయపడింది. పక్కమీదున్న ముసలాయన భయభ్రాంతుడవటం, మరికొన్ని క్షణాలలోనే తనకి తెలీకుండానే యాంత్రికంగాఏదో శక్తి దూసుకువచ్చినట్టుగా మంచంమించి లేచి నాలుగు అడుగులు ముందుకు వేసి– నిండు భక్తి పారవశ్యం వుప్పొంగిరాగా. ఆగంతకుడి కాళ్ళ దగ్గర సాష్టాంగ ప్రణామం చేస్తూ వుండిపోయాడు "నన్ను క్షమించండి బాబూ" అని గొణుగుతూ.

ఆ దృశ్యాన్ని చూసిన మామ్మకు నోట మాట రాలేదు. పట్టలేనంత ఆనందంతో కళ్లు చెమర్చాయి. భక్తిప్రపత్తులతో తనూ ప్రణమిల్లింది. శాంతి వింతగా చూస్తూ వుండిపోయింది —— తన లాగు సంగతి మరిచిపోయి.

ఆయన ముఖం ప్రసన్నం అయింది. కుడిచెయ్యి ఎత్తి "మీకు శుభం కలుగుతుంది"–అని–ఆ ముసిలి దంపతుల్ని ఆశీర్వదించాడు.

"ఏవండీ మీ కాళ్ళూ చేతులూ వచ్చేశాయి!" సంతోషం పెనవేసుకున్న మామ్మ మాటలవి.

అంతవరకూ చూసుకోనేలేదు ముసలాయన – తన చేతులూ. కాళ్ళూ వచ్చేశాయ్! ఇటూ అటూ ఆడించి చూసుకున్నాడు–ఏమి సందేహం లేదు. "నిజం వచ్చేశాయి-అంతా స్వామి దయ" అంటూ తృప్తిగా చేతులు జోడించాడు ముసలాయన – ఎనలేని సంతోషంతో. చేతులు జోడించిన మామ్మ "మా వారికి చేతులూ కాళ్లూ తెప్పించి నిన్ను ఎంతగానో ఆదుకున్నారు బాబూ.... యింతకన్నా నాకీ జన్మకి మరేవీ అక్కరలేదు బాబూ" తృప్తిని మాటల్లో వ్యక్తపరచడానికి ప్రయత్నిస్తూ అంది.

దేవుడు చిన్నగా మందహాసం చేసి. తల పంకించి. నెమ్మదిగా వెనక్కి తిరిగి మధ్య గదిలోకి ప్రవేశించాడు.

సరిగ్గా అప్పుడే గుర్తుకు తెచ్చుకున్న మామ్మ "మా కొడుకూ కోడల్ని కూడా ఆశీర్వదించి వెళుదురుగాని బాబూ...." అంటూ అభ్యర్థించింది.

ఆయన. తన అంగీకారాన్ని సూచించాడు– మౌనం అవలంబించి మామ్మ. శాంతిని పంపింది– దేవుడొచ్చాడని. చెప్పి అమ్మనీ. నాన్ననీ పిలుచుకు రమ్మని. పాప పరిగెత్తింది — వీథిలోకి — పొలంలో పనిచెయ్యడానికి వెళ్లిన అమ్మనీ. నాన్ననీ పిలవటానికి ఆయన గదులూ. పరిసరాలు– కలియజూస్తున్నారు నెమ్మదిగా. ఆయనను వెన్నంటే ఆ ముసలిదంపతులు భక్తిప్రపత్తులతో వస్తూ వున్నారు.

ఆయన నెమ్మదిగా. హుందాగా అడుగులువేస్తూ వీధి వరండాలోకి అడుగు పెట్టాడు. ముసలి దంపతులు అక్కడే ఓ పక్కకి నిలబడ్డారు–ఆయన్నే చూస్తూ.

సరిగ్గా అప్పుడే వీథి తలుపుగుండా ఒక యువజంట అడుగుపెట్టారు–శాంతి వాళ్ళ వెనకాలే వుంది. తెల్ల లుంగీ మడిచికట్టిన ఆ యువకుడు ఏదో అనబోయి– వరండాలో నిలబడివున్న ఆ మూర్తిని చూసి చకితుడయ్యాడు. సాదా చీర కట్టిన ఆ స్త్రీ ఒక్కసారిగా చలించింది. వాళ్ళ మనసులు అదోలా కాసాగాయి. ఓ రెండడుగులు లోపలికి వేసి. అక్కడే వుండిపోయారు ఆ యిద్దరూ. అప్రయత్నంగా చేతులు జోడించాడు.

చిన్న మందహాసం తొణికిసలాడింది ఆయన పెదిమలమీద. ఆయన నెమ్మదిగా ముందుకు రాసాగారు. ఆయన్ని అనుసరించారు ముసలి దంపతులు. ఆయన రావటం చూసి దారి యిచ్చారు. నవదంపతులు. శాంతి. తల్లి చీరకొంగు పట్టుకొని వరుసగా అందరి ముఖాల్లోకి చూస్తూ వుంది.

వీధి వాకిటిలోకి వచ్చారాయన.

ఆ యువకుడు – ఏదో అడగబోయి నోరిప్పి. అంతట్లోనే విరమించుకున్నట్లుగా ఆగిపోయాడు.

వాకిటోవున్న ఆయన వెనక్కి తిరిగి. ఆ యువకుని ముఖంలోకి సూటిగా చూశారు. "అడుగు సందేహించకు" అన్నారు – అతన్ని అర్థం చేసుకున్నట్లుగా.

ఆయన్నే పరీక్షగా చూస్తూ. ఆ యువకుడు ఇలా చెప్పాడు.

"మిమ్మల్ని చూడగానే యిది అడగాలనిపించింది బాబూ .... మేం యింతలా పగలనకా, రాత్రనకా తంటాలు పడుతూ వున్నా తిండి గింజలు మాకు కరువయిపోతున్నాయి బాబూ.... అసలు. ఇలా ఎందుకు జరగాలి బాబూ? కొంత మందికి అన్నీయిచ్చి: మా లాంటి వాళ్ళకీ దరిద్రం మీరు ఎందుకు జతచేశారు బాబూ?"

అది విని. ఒక్కసారి తలయెత్తి ఆకాశంవయిపుచూశారాయన శూన్యంలోకి చూస్తూన్నట్లుగా ఆయన ముఖం అలా నిశ్చలంగా వుండిపోయింది. నోటిలోంచి ఈ మాటలు వెలువడ్డాయి:

"మీరు భూమి దున్నుతారు – ఆ నాగటి చాలుకింద చీమలు. పురుగులు యెన్నో రకాల జీవాలు నలిగి ప్రాణాలు పోగొట్టుకుంటాయి. ఆ జీవాలన్నీ నాదగ్గర కొచ్చి "మేం వాళ్ళకేం అపకారం చేశాం. మమ్మల్నిలా బతకనియ్యకూడదా. మేం ఎందుకిలా నశించిపోవాలి. వాళ్ళెందుకు సుఖపడాలి" అని అడిగితే – మీరు ఎందుకు దున్నుతారో, దాన్నించి ఏం సంపాదిస్తారో చెబితే. వాటికేం అర్థమవుతుంది! అలాగే కొందరు ఎందుకు సుఖించాలి. కొందరు ఎందుకు కష్టపడాలి–అనేది మీకు నే చెప్పినా అర్థం కాదు–అది సృష్టి రహస్యం."

ఆ మాటలు వాళ్ళ అందరి చెవుల్లో మళ్ళీ మళ్ళీ వినిపించాయి. అందరూ గుమ్మం బయట నిలబడి వుండి ఆయన్నే చూస్తూ ఉన్నారు – మైమరచి.

ఓసారి. ఆయన వెనక్కి తిరిగి వాళ్ళని చూసి. కుడిచెయ్యి పయికెత్తి ఆశీర్వదించి ముందుకు అడుగులు వేశారు.

రోడ్డుమీద నాలుగయిదు అడుగులు నడిచేలోపలే. ఒక తెల్లటి వ్యాను దూసుకు వచ్చి. ఆయన ముందే ఆగింది. అందులోంచి తెల్లటి దుస్తుల్లో వున్న యిద్దరు వ్యక్తులు దిగి. ఆయనను లోనికి ఆహ్వానిస్తూన్నట్లుగా చేతులు జాపారు– ఆయన లోపలకు వెళ్ళగానే. వాళ్ళు తమ తమ సీట్లు ఆక్రమించి తలుపులు మూశారు. వ్యాను బయలుదేరింది. ఆ తెల్లటి వ్యాన్ వెనుకభాగాన దుమ్ము పట్టివున్న ఈ నల్లటి అక్షరాలు కనిపించాయ్– పిచ్చాసుపత్రి.

★